క్లుప్తంగా

న్యాయ విభాగం జోనల్, జిల్లా విభాగాల అధ్యక్షుల ఎంపిక

రాయచోటి : వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా జోనల్ జిల్లా న్యాయ విభాగాల అధ్యక్షుల పేర్లను ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. న్యాయ విభాగం జోనల్ ఇన్‌చార్జిగా మిరపకాయల ప్రభాకర్, అన్నమయ్య జిల్లా న్యాయ విభాగం అధ్యక్షుడిగా విసి రెడ్డప్పరెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అందుబాటులోకి ఈ- స్టాంపింగ్ సేవలు

సిద్దవటం : సిద్దవటంలోని డీసీసీ బ్యాంకులో నూతనంగా ఈ-స్టాంపింగ్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు బ్యాంకు మేనేజర్ సుచిత్ర తెలిపారు. స్థానిక డీసీసీ బ్యాంకులో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ-స్టాంపింగ్ విధానం ద్వారా జ్యుడీషియల్ రూ. 10, రూ. 100 బాండ్స్ ఎలాంటి కమీషన్ లేకుండా సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే 12 సంవత్సరాల లోపు పిల్లలకు కిడ్డీస్ అకౌంట్లు తెరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, సిద్దవటం సొసైటీ సీఈఓ షుకుర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు

రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో గురువారం బండపల్లె వద్ద గల ప్రేమాలయంలోని వృద్ధులకు రాయచోటి పట్టణానికి చెందిన డి.మహేంద్ర ఆర్థిక సౌజన్యంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పీఎస్ హరినాథ్‌రెడ్డి, వెంకటన్న, వెంకటమ్మ, మౌనిక, శ్రీజ, మనోజ్ఞ, భాను, వెంకట్, ఆశ్రమం మేనేజర్ సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతిలేని కట్టడాన్ని తొలగించండి



బొమ్మవరం, కమ్మపల్లి వద్ద అనుమతి లేకుండా నిర్మిస్తున్న కట్టడం

ఓబులవారిపల్లె : బొమ్మవరం పంచాయతీ, బి.కమ్మపల్లె గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై అనుమతులు లేకుండా బొప్పాయి పరిశ్రమ కోసం ఏర్పాటు చేస్తున్న కట్టడాన్ని తొలగించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. బొమ్మవరం చెరువుకు వెళ్లే కాలువ పక్కన ఉప్పునీటిలో బొప్పాయి శుద్ధిచేసే పరిశ్రమను అనుమతులు లేకుండా నిర్మించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పచ్చి బొప్పాయి ప్రాసెసింగ్ చేసే పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఉప్పునీరు కాలువగుండా చెరువులోకి చేరి చెరువులోని నీరు కలుషితమై చెరువు ఆయకట్టు కింద ఉన్న పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి అనుమతి లేని కట్టడాన్ని తొలగించాలని రైతులు కోరుతున్నారు.

జిల్లా స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రామాపురం : నియోజకవర్గ స్థాయిలో జరిగిన అండర్ 14, అండర్ 17 త్రోబాల్ పోటీలలో నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. లక్ష్మణ్, హరీష్, కృష్ణబాబు, గణేష్, సుబ్బరామయ్యలు అండర్ 17కి ఎంపిక కాగా, నాగచైతన్య, హర్షవర్దన్, బాబు, సాగర్, భరత్, సుశాంత్‌లు అండర్14కు ఎంపికయ్యారని వివరించారు. త్వరలో జిల్లా స్థాయిలో త్రోబాల్ పోటీలు జరుగుతాయన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్ పుల్లారెడ్డితో మాట్లాడుతున్న వత్తలూరు సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె: రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ పుల్లారెడ్డిని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రైతుల సమస్యలపై తహసీల్దార్‌తో చర్చించారు. గాదెల దళితవాడకు సంబంధించి సర్వే నంబరు 998లో 5 ఎకరాలు ఒక్కొక్కరికి ఎకరా చొప్పున భూములు ఇచ్చారన్నారు. భూ సర్వే నిర్వహించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యల్లాయపల్లి సర్పంచ్ జరుగు నారాయణరెడ్డి, ఆర్‌ఐ రామ్మోహన్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ



రాజకీయ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామకృష్ణారెడ్డి

రాజంపేట రూరల్ : సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకుందామని ఆర్డీఓ జి.రామకృష్ణారెడ్డి సూచించారు. స్థానిక సబ్ కలెక్టరేట్ సభాభవనంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడంలో ఉన్న సమస్యలను వివరించాలని కోరారు. కొందరు నూతనంగా బూత్‌లు ఏర్పాటు చేసే ప్రదేశాలను సూచించారు. మరికొందరు కొన్ని చోట్ల ఉన్న బూత్‌లను తొలగించాలని కోరారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ 1400కు మించి ఓటర్లు ఉన్న బూత్‌లను విభజిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, వీరబల్లి తహసీల్దార్లు ముద్దా సుబ్రమణ్యంరెడ్డి, సత్యానందం, మాధవీలత, మహేశ్వరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పి. మోహనకృష్ణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన ఆర్డీఓ

సంబేపల్లి : మండల పరిధిలోని శెట్టిపల్లి పంచాయతీ, నరసారెడ్డిగారిపల్లి సమీపంలోని పోలింగ్ కేంద్రం నంబర్ 273ను గురువారం ఆర్డీఓ రంగస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో మార్పులు, చేర్పులలో భాగంగా మండల వ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శెట్టిపల్లి పంచాయతీలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరీబాయి, సర్వేయర్ రామాంజులు, తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రంగస్వామి

రక్తదానం మరొకరికి ప్రాణదానం



ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా రక్తదానం చేస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లి : రక్తదానం మరొకరికి ప్రాణదానమని, అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, డీఎంహెచ్ఓ కొండయ్య, డీసీహెచ్ఎస్ డేవిడ్ కుమార్‌లు పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. తొలుత ఏడు కోట్ల రూపాయలతో నిర్మించిన ఆసుపత్రి నూతన భవనంలోని అన్ని విభాగాలను వారు పరిశీలించారు.

అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డితోపాటు ఎంపీటీసీలు జగన్ మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ యువత రక్తదానం చేశారు. రక్తదాతలకు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి, సహదేవరెడ్డిల ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ధరణి కుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు విజయ భాస్కర్, మహమ్మద్ రఫీ, గంగమ్మ ఆలయ చైర్మన్ సామాల నరసింహారెడ్డి , సర్పంచ్ వెంకట నారాయణ రెడ్డి, ఎంపీటీసీ శంకర్ నాయుడు, ఉప సర్పంచ్‌లు రాజారెడ్డి, సంజీవరెడ్డి, వైద్యులు నవాజ్, నిసార్ అహ్మద్, భరత్ కుమార్ రెడ్డి, సిబ్బంది రెడ్డికృష్ణ, రెడ్డి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాపు మహిళలు

చిట్వేలి : రాజుకుంట సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి కాపు మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు మాధినేని కనకరాజు, నానబాల నారాయణ, యువకులు మాధినేని లోకేష్‌లు మాట్లాడుతూ రాజుకుంట సచివాలయ పరిధిలో 77 మంది కాపు మహిళలకు రూ.11.50 లక్షలు ఖాతాలలో జమ అయ్యాయన్నారు. అందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు ప్రసాద్, ఎం.సుబ్బరాయుడు, శిరీషా, వెంకటసుబ్బమ్మ, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యమాలపై నిర్బంధం అప్రజాస్వామికం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు

రాయచోటి అర్బన్ : ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూడడం, ఉద్యమాలపై నిర్బంధం విధించడం అప్రజాస్వామికమని వక్తలు అన్నారు. గురువారం స్థానిక ఎన్‌జీఓ సభాభవనంలో సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు పి.ఎల్.నరసింహులు, పి.శ్రీనివాసులు మాట్లాడుతూ పోలీసులను అడ్డుపెట్టుకుని నిర్బంధ కాండను అమలు చేస్తుండడం క్షమించరాని నేరమన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించే ప్రజా సంఘాలు, రాజకీయపార్టీల నేతలపై అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేస్తుండడం దారుణమన్నారు. కాంగ్రెస్ నాయకుడు నాగమునిరెడ్డి, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథనాయక్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, టీడీపీ నాయకుడు కొట్టే చలపతి, బంజారా సంఘం, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి, రైతుసంఘం, మహిళా సమాఖ్య తదితర సంఘాల నాయకులు మాట్లాడారు.

దేశం బాగుపడాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ తంబళ్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి

సిద్దవటం : దేశం బాగుపడాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని రాజంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ తంబళ్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన సిద్దవటంలో గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాజంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు చీకటి చార్లెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు, దళితులు కుల మత, వర్గ భేదాలు లేకుండా దేశం బాగుపడాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. అనంతరం సిద్దవటం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బత్తెన భాస్కర్‌ను, నందలూరు అధ్యక్షుడిగా నార్ల వెంకటేష్, ఒంటిమిట్ట అధ్యక్షుడిగా కూండ్ల వేణుగోపాల్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అత్తింజరి శ్రీనాథ్, కార్యకర్తలు సువార్తమ్మ, నారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఇంటర్వ్యూలు పూర్తి



అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

చిట్వేలి : రాజంపేట డివిజన్ పరిధిలోని రాజంపేట, చిట్వేలి, రైల్వేకోడూరు, సుండుపల్లె అంగన్‌వాడీ ప్రాజెక్టుల్లోని వర్కర్లు, హెల్పర్లకు గురువారం రాజంపేట ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు పూర్తయినట్లు చిట్వేలి సీడీపీఓ రాజేశ్వరి తెలిపారు. చిట్వేలి ప్రాజెక్టులోని వైఎస్సార్ ఎస్టీ కాలనీ, కట్టావారిపల్లి, ఓబిలి హెచ్‌డబ్ల్యూ గ్రామాలలోని హెల్పర్ పోస్టులకు రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి సమక్షంలో జరిగిన ఇంటర్వ్యూలకు ఐదుగురు హాజరైనట్లు తెలిపారు. అభ్యర్థులు అంకితభావంతో పనిచేయాలని ఆర్డీఓ సూచించారు. ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను తర్వాత తెలియజేస్తామని చిట్వేలి సీడీపీఓ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ



గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాగిరెడ్డిపల్లి హెచ్ఎం, ఎంఈఓ, ఉపాధ్యాయులు



గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



గురజాడ జయంతి వేడుకలో ఉపాధ్యాయులు

రాజంపేట (నందలూరు) : దేశమును ప్రేమించుమన్నా.. పుత్తడిబొమ్మ పూర్ణమ్మ... కన్యక.. కన్యాశుల్కం లాంటి రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు కృషిచేసిన అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ వెంకట అప్పారావు అని వక్తలు కొనియాడారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు పండితుడు గంగసపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త, మహాకవి గురజాడ అప్పారావు 161వ జయంతి వేడుకలను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి ఎల్.నాగయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. దేశమును ప్రేమించుమన్నా అనే గేయం దేశభక్తిని ప్రబోధించి, దేశాభివృద్ధికి ప్రజలను కర్తవ్యోన్ముఖులను చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు రమణమ్మ, ఖాదర్ బాషా, డాక్టర్ నాగేంద్ర ప్రసాద్, ఆనందాచారి, లక్ష్మీనారాయణ, సుబ్బరాయుడు, వెంకటరమణ, జీవీ ప్రసాద్ రావు, విజయకుమారి, వెంకట రమణమ్మ, జ్యోతి ప్రియ, ప్రమీల రహేల్, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి

సిద్దవటం : భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎండీ జాఫర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి సమీర్‌బాషా తదితరులు గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఆధునిక భావాలు చిగురు తొడుగుతున్న రోజుల్లో నవ్య కవితాకాశంలో వినూత్నంగా మెరిసిన మరో సూర్యుడు గురజాడ అప్పారావు అని అభివర్ణించారు. సంఘంలో దురాచారాలను ధైర్యంగా ఎదిరించి నిలిచిన సాహసి అన్నారు. సమీర్ బాషా మాట్లాడుతూ దేశభక్తి అంటే ప్రజల మధ్య వ్యత్యాసాలను సృష్టించి, చిచ్చుపెట్టి, కుల మతాల పేరుతో విడదీయడం కాదన్నారు. నిజమైన దేశభక్తి అంటే ప్రజలను కలపడం, వాళ్లను గౌరవించడం, వాళ్లకు సమానమైన హక్కులను కల్పించడం, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమేనని గురజాడ అప్పారావు తెలియజేశారన్నారు. తెలుగు పండితుడు నరసింహులు మాట్లాడుతూ సాహిత్యంలో వాడుక భాషను ప్రవేశ పెట్టి కన్యాశుల్కం, సారంగధర, ముత్యాలసరాలు, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, దిద్దుబాటు వంటి గొప్ప రచనల ద్వారా సాంఘిక దురాచారాలను రూపు మాపేందుకు కృషి చేసిన గొప్ప సంస్కర్త గురజాడ న్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమునిరెడ్డి, రమణయ్య, రామ సుబ్బారెడ్డి, రవిశంకర్, సిరాజుల్లా, చంద్ర, విజయశ్రీ, రాజమ్మ, పరమేశ్వరి, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధునిక భాషకు ఆద్యుడు గురజాడ

గాలివీడు : ఆధునిక భాషకు ఆద్యుడు మహాకవి గురజాడ వెంకట అప్పారావు అని ప్రధానోపాధ్యాయుడు గౌస్ మొహిద్దీన్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురజాడ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక తెలుగు భాష కోసం గురజాడ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన రచనల్లో కన్యాశుల్కం నాటకం ద్వారా బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాలయానికి రూ.30 వేలు విరాళం

రైల్వేకోడూరు : మైసూరువారిపల్లె పంచాయతీలోని రాజీవ్ నగర్‌లో రామాలయానికి గురువారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆదేశాల మేరకు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి రూ.30వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలన్నారు.

విద్యాదీవెన నిధులను విడుదల చేయాలి

రాయచోటి అర్బన్ : జగనన్న విద్యాదీవెనకు సంబంధించిన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మాసాపేటలో నిర్వహించిన పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సకాలంలో విద్యాదీవెన డబ్బులు అందక ఫీజులు చెల్లించలేక విద్యార్థులు, సకాలంలో నిధులు అందక కళాశాలల నిర్వహణ ఎలా చేయాలో తెలియక కళాశాలల యాజమాన్యాలు తల్లడిల్లుతున్నాయన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి జోకేశ్వర్, పట్టణ నాయకులు గణేష్‌రెడ్డి, శ్రీధర్, ఫయాజ్, రెడ్డెయ్య, సురేష్, అంజి, శివప్రసాద్, దామోదర్, శివక్రిష్ణ, వాజిద్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు సిద్దవటంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి

సిద్దవటం : సిద్దవటంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, జిల్లా అధికారులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జవహర్‌బాబు, తహసీల్దార్ లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్‌క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పది ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు

వ్యవసాయ శాఖ జేడీ చంద్రనాయక్

రాయచోటి : వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం కింద అన్నమయ్య జిల్లాకు పది ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరయినట్లు వ్యవసాయశాఖ జేడీ చంద్రనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ప్రాసెసింగ్ యూనిట్‌కు సంబంధించి యూనిట్ ధరలో 50శాతం లేదా రెండు లక్షలు ఏది తక్కువ అయితే అది సిఫారసు చేసి డిబిటీ మోడ్ ద్వారా అమలు చేయబడుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో జిల్లా కొనుగోలు కమిటీ ద్వారా ఎంపానల్మెంట్ అయిన కంపెనీల నుంచి కొనుగోలు చేస్తామని వివరించారు. అన్నమయ్య జిల్లాలో రాసముద్రం, మొలకల చెరువు, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు, చిన్నమండెం మండలాలలో ఏపీఎండీసీ ద్వారా నడపబడుతున్న ఎఫ్‌పీఓలను గుర్తించామని పేర్కొన్నారు. మిల్లెట్లకు సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్స్ కానీ, పప్పు ధాన్యాలకు సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్స్, వేరుశనగకు సంబంధించిన ప్రాసెసింగ్ యూనిట్స్ సరఫరా చేయదలచుకున్న సంస్థలు లేదా డీలర్లు ఎంపానల్మెంట్ కోసం ఈనెల 24వ తేదీ లోపల జిల్లా వ్యవసాయ అధికారి వారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జేడీ సూచించారు.

నాలుగో రోజూ కొనసాగిన నిమజ్జనం



రాజంపేట టౌన్: నిమజ్జనానికి ఊరేగింపుగా తరలుతున్న గణనాథుడు



రాజంపేట టౌన్ : నిమజ్జనంలో ఉత్సాహంగా నృత్యం చేస్తున్న యువతులు



రాజంపేట టౌన్ : ఉట్టికొట్టేందుకు యత్నిస్తున్న యువకుడు



సిద్ధిబుద్ధిక్‌ల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

రాజంపేట టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా గణనాథుని నిమజ్జన వేడుకలు కోలాహలంగా సాగుతున్నాయి. వివిధ ఉత్సవ కమిటీలు గురువారం వినాయక నిమజ్జన వేడుకలను చేపట్టాయి. ఈ సందర్భంగా యువతీ, యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ నిమజ్జనం వెంట సాగారు. కాగా పట్టణంలోని గంగిరెడ్డిపాళెంలో ఉట్టికొట్టే కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా సాగింది.

ఘనంగా వినాయకునికి వీడ్కోలు

ఓబులవారిపల్లె : మండలంలోని యల్లాయపల్లి, చిన్నఓరంపాడు పంచాయతీలలో గురువారం ఘనంగా వినాయకునికి వీడ్కోలు పలికారు. చిన్న ఓరంపాడు దిగువపల్లి గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి వినాయకున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చొప్పా గంగిరెడ్డి, వంకన దిలీప్ కుమార్ రెడ్డి, ముక్కా సురేష్ కుమార్ రెడ్డి, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గంగ ఒడిలోకి చేరిన గణనాథులు

సంబేపల్లి: గణనాథుని నిమజ్జనం కార్యక్రమాన్ని మండలంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

అంగరంగ వైభవంగా సిద్ధీబుద్ధిక్‌ల కల్యాణం

పెనగలూరు : పెనగలూరు పంచాయతీలోని ఇండ్లూరు గ్రామంలో సిద్ధీబుద్ధిక్‌ల కల్యాణం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. వినాయక చవితి సందర్భంగా కొత్తపల్లిలోని సిద్ధిబుద్ధిక్‌ల ఆలయంలో ఎ.నరసింహారెడ్డి, పద్మమ్మ దంపతులు ఈ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పూజారి రామలింగయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యల ఆధ్వర్యంలో వేద పండితులు ఈ కల్యాణం జరిపారు.

రూ.లక్ష 3వేలు పలికిన కొత్తపల్లి లడ్డు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు కొత్తపల్లికి చెందిన వినాయకస్వామి లడ్డు లక్ష మూడు వేల రూపాయలు పలికింది. బుధవారం రాత్రి 10 గంటలకు లడ్డును వేలం వేయగా కొత్తపల్లి గ్రామానికి చెందిన గ్రంథే సుకుమార్ వేలంపాట పాడి లడ్డు ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే ఇండ్లూరు వినాయక మండపం వద్ద ఉన్న 50 కేజీల లడ్డును వేలం వేయగా జేపూరు వెంకటసుబ్బారెడ్డి లక్ష రూపాయలకు లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు.

వేలం పాటలో రూ.32వేలు పలికిన లడ్డు

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని మన్నూరు వక్కల వీధిలో వినాయక చవితి వేడుకలో లడ్డు వేలం పాట నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా కార్యదర్శి మిరియాల సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ. 32వేలకు స్వామి వారి లడ్డును దక్కించుకున్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి, రెడ్డిపల్లి, దళవాయిపల్లి, కేతరాజుపల్లి తదితర గ్రామాలలో గురువారం బొజ్జగణపయ్య ప్రతిమలు నిమజ్జనానికి పెద్దఎత్తున తరలివెళ్లాయి. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

రూ. 56 వేలు పలికిన గణనాథుని లడ్డు

పుల్లంపేట: మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామ పంచాయతీలో గురువారం వినాయకుని నిమజ్జనం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గణనాథుని లడ్డుకు వేలంపాట నిర్వహించగా రూ. 56 వేలకు లగిడి శాంతమ్మ దక్కించుకున్నారు.

ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు

రాజంపేట (నందలూరు) : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ ఆర్ఎస్ రోడ్డు, ఎన్టీఆర్ నగర్ వద్ద ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకస్వామి విగ్రహం ఆవరణంలో నిర్వహించిన కబడ్డీ, లెమన్ అండ్ స్పూన్, బెలూన్ గేమ్, సాక్రాచ్, మ్యూజికల్ చైర్స్, ఈటింగ్ పోటీలలో గెలుపొందిన పిల్లలకు గురువారం సాయంత్రం పల్లపు సాయితేజ సౌజన్యంతో బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వినాయక యూత్ సభ్యులు పాల్గొన్నారు.



రాజంపేట రూరల్: లడ్డును దక్కించుకున్న సురేఖ



అనంతంపల్లిలో రూ. 60 వేలు పలికిన లడ్డు ఇదే



ఆటల పోటీలలో బహుమతులు గెలుపొందిన చిన్నారులు